# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సుప్రీం కోర్టు తలుపులు అందరి కోసం తెరిచే ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.
- యువత నూతన ఆలోచనలతో దేశ అభివృద్ధికి దోహదపడాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.
- ఢిల్లీలోని `జంతర్ మంతర్`ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుండి తొలగించినట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ తెలిపారు.
- ఆసియా క్రీడల్లో 27 పతకాలు సాధించిన క్రీడాకారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

============================

సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని తెలిపారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

============================

యువత నూతన ఆలోచనలతో  దేశ అభివృద్ధికి దోహదపడాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఢిల్లీ డైలాగ్-2026 కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... 140 కోట్ల జనాభా కలిగిన భారత్ లో యువత అధికంగా ఉందని గుర్తు చేశారు. అనేక దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటుండగా, భారతదేశంలో సగటు వయస్సు 30 ఏళ్ల లోపే ఉందన్నారు. రాబోయే మూడు దశాబ్దాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని కేంద్రమంత్రి చెప్పారు.

(వాయిస్ 28 సెకన్లు)

ఇదిలా ఉండగా 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందనే నమ్మకాన్ని కూడా కేంద్రమంత్రి వ్యక్తం చేశారు.

==============================

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుండి తొలగించినట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జంతర్ మంతర్‌ను నిరసనలు తెలిపే ప్రదేశం నుంచి డీనోటిఫై చేస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి మూడు ప్రదేశాలను గుర్తించామని ఆయన వెల్లడించారు. అవి రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ గా తెలిపారు. ఇక నుంచి ఆ మూడు ప్రాంతాలలోనే ఆందోళలు, ప్రదర్శనలు, బైఠాయింపులు చేసుకోవాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్ సూచించారు. ఇందుకోసం త్వరలోనే వేర్వేరుగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను విడుదల చేస్తామని తెలిపారు.

==============================

జపాన్‌లో ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో 27 పతకాలు సాధించిన మూడు సేవలకు చెందిన క్రీడాకారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఈ క్రీడాకారులు ఆరు స్వర్ణాలు, పదకొండు రజతాలు, పది కాంస్య పతకాలు గెలుచుకొని.. భారతదేశం మొత్తం 85 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిపారు. క్రీడాకారుల క్రమశిక్షణ, కృషి, జట్టు స్ఫూర్తిని రాజ్ నాథ్ సింగ్ ఈ సందర్భంగా ప్రశంసించారు. క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంలో మిషన్ ఒలింపిక్ వింగ్, కోచ్‌లు, సహాయక సిబ్బందిని కూడా ఆయన అభినందించారు.

(వాయిస్ 23 సెకన్లు)

==============================

దేశీయ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. అహ్మదాబాద్‌లోని వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో `బ్రిక్స్ సాంప్రదాయ దేశీయ క్రీడలు 2026`ను ఆయన ఈ రోజు ప్రారంభించారు.  కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, గుజరాత్ ప్రభుత్వ సహకారంతో ఈ క్రీడలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో `ఖేలో ఇండియా` వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు సుస్థిరమైన క్రీడా వ్యవస్థను రూపొందిస్తున్నాయని తెలిపారు.

విరామం

==============================

ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ స్మారక పురస్కారం రాబర్ట్ ఈహాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు లభించింది. స్థూల ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడంలో సూక్ష్మ ఆర్థిక శాస్త్ర పునాదులపై వారు చేసిన పరిశోధనలకు ఈ పురస్కారం ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించే విధానాలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఆర్థిక నమూనాలను పునర్నిర్మించవచ్చని ఈ ఇద్దరు పరిశోధకులు నిరూపించారు. ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి స్థూల ఆర్థిక అంశాల మధ్య గణాంక

సంబంధాల ఆధారంగా మాత్రమే నమూనాలను రూపొందించకుండా.. సూక్ష్మ ఆర్థిక శాస్త్ర పునాదులపై వాటిని నిర్మించడంపై వీరు దృష్టి సారించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆయుధాలు, సాంకేతికత పరికరాలు వంటి అన్ని రంగాలలో స్వావలంబన, ఆధునికీకరణ సాధించడంపై దృష్టి సారించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత సైన్యం, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... భారతదేశం తన రక్షణ అవసరాలలో గణనీయమైన వాటాను దేశీయంగానే తయారు చేస్తోందని తెలిపారు. సైనికులకు మంచి ఆహారం, సరైన పరికరాలు, నాణ్యమైన శిక్షణ, తగిన సౌకర్యాలు కల్పించడం వంటివి వారి మనోధైర్యాన్ని పెంచడంలో సహాయపడతాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - యునైటెడ్ కింగ్ డం మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత్-యూకే సంయుక్త ఆర్థిక, వాణిజ్య కమిటీ (జెట్కో) 16వ సమావేశం సందర్భంగా జెట్కో బిజినెస్ ప్లీనరీలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... నిరంతర సంప్రదింపులు, పటిష్టమైన సంస్థాగత యంత్రాంగాలు, మెరుగైన సహకారం ద్వారా భారత్-యూకే ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంపొందించడానికి భారతదేశం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఇది ఇరు దేశాల వ్యాపారాలకు కొత్త అవకాశాలను అందిస్తుందన్నారు. భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ద్వారా లభించిన అవకాశాలను విస్తృత వాణిజ్యం, పెట్టుబడులు, భాగస్వామ్యాలు, ఉద్యోగ కల్పనగా మలచుకోవాలని భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వ్యాపార సంస్థలకు కేంద్రమంత్రి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఆసుపత్రుల్లో అందించే సేవలు, సౌకర్యాలకు వసూలు చేసే ధరలను స్పష్టంగా ప్రదర్శించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్రం కోరింది. చికిత్సకు ముందే రోగులకు వారి వైద్య ఖర్చులను ప్రణాళిక చేసుకోవడానికి ఈ విధానం సహాయపడుతుందని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ విషయమై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీగా రోగుల అవసరాలకు అనుగుణంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ విధానం బలపరుస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్థికాభివృద్ధిని పర్యావరణ భద్రతతో అనుసంధానించాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సూచించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారుల కోసం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నవారిని ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడుతూ... భారతదేశ అడవులు, వన్యప్రాణులు పర్యావరణ వారసత్వాన్ని పరిరక్షించడంలో అధికారుల కృషిని అభినందించారు. పౌర భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా వన్యప్రాణుల పరిరక్షణ, అటవీ వృక్ష విస్తీర్ణాన్ని పెంచడం, చిత్తడి నేలల పరిరక్షణ, ప్రకృతి దృశ్యాల పునరుద్ధరణలో భారతదేశం సాధించిన పురోగతిని మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్‌లలో రేపటి వరకూ ఉరుములతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, ఆంధ్రప్రదేశ్, కేరళం, మాహేలలో కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. రాబోయే రెండు రోజుల్లో తూర్పు భారతదేశంలోని మరికొన్ని ప్రాంతాలు, ఉత్తర ద్వీపకల్పం, అలాగే ఈశాన్య

భారతదేశంలోని అనేక ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు మరింతగా ఉపసంహరించుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండి వెల్లడించింది.

==============================

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (CSL) నిర్మించిన మూడవ జలాంతర్గామి ఐఎన్ఎస్ మంగ్రోల్‌ను భారత నౌకాదళం ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో ఈరోజు ప్రారంభించింది. ఈ స్వదేశీ యుద్ధనౌక తీర ప్రాంత నిస్సార జలాల్లో జలాంతర్గామి ముప్పులను గుర్తించి ఎదుర్కొనే నౌకాదళ సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన ముందడుగుగా అధికారులు పేర్కొంటున్నారు.

==============================

==============================